సాక్షి నాగర్‌కర్నూల్

మంగళవారం ; 7 ; మార్చి ; 2023



చెక్‌డ్యాంకు గండ్లు

రూ.కోట్లు వెచ్చించి చెక్‌డ్యాంలు నిర్మిస్తున్నా.. నాణ్యత లోపంతో గండ్లు పడుతున్నాయి.

వివరాలు 8లో ▸



యాక్షన్‌ప్లాన్ ప్రకారం బోధన

యాక్షన్ ప్లాన్ ప్రకారం బోధించాలని స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన అన్నారు.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.2 /19.4

తెల్లవారుజామున చలి ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం నుంచి ఆకాశం నిర్మలంగా ఉండి ఉక్కపోసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పాఠశాలకు దాతల చేయూత అభినందనీయం



కందనూలు: తాను చదివిన పాఠశాల అభివృద్ధికి తనవంతు సాయంగా రూ.14లక్షలు అందించడం అభినందనీయమని, మిగతా పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని డీఈఓ గోవిందరాజులు పిలుపునిచ్చారు. సోమవారం మంతటి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం రూ. 14లక్షల విరాళాన్ని ఎన్‌ఆర్‌ఐ గడ్డంపల్లి వెంకట్‌రెడ్డి ఆయన తల్లిదండ్రులు గడ్డంపల్లి రాంరెడ్డి, వెంకటమ్మ జ్ఞాపకార్థం డీఈఓ చేతుల మీదుగా హెచ్‌ఎంకు అందజేశారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ.. ఎన్నారై వెంకట్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఈ నెలాఖరు నాటికి 50శాతం పాఠశాలల్లో మన ఊరు మన బడి పనులు పూర్తి కానున్నాయన్నారు. ప్రతిఒక్కరూ జీవితంలో ఉన్నత స్థానాల్లోకి చేరుకోవాలంటే విద్య ఒక్కటే మార్గమని, ప్రధానంగా బాలికలు చదువుకోవాలని ఎన్‌ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేశ్వర్ రెడ్డి, ఎంపీడీఓ కోటేశ్వర్, సర్పంచ్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు పెంచాలి



నాగర్‌కర్నూల్ రూరల్: పోషక విలువలు మెండుగా ఉండే కొర్రలు, అండుకొర్రలు, జొన్నలు, ఇతర చిరుధాన్యాల సాగు పెంచాలని పాలెం కేవీకే శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని కుమ్మెరలో రావేఫ్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషక ఆహార, కుటుంబ సాంకేతిక సలహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మానవ జీవనంలో సాంకేతికత ఆవశ్యకత, మానసిక ఒత్తిడిని అధిగమించాల్సిన అవసరం ఉందని, మెరుగైన జీవనానికి పోషకాల ఆవశ్యకత ఎంతో అవసరమన్నారు. అనంతరం దైనందిన జీవనంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా తీసుకోవాల్సిన సమతుల్య ఆహారం, మహిళా రైతులు స్థాపించదగిన వ్యవసాయ, అనుబంధ రంగాల్లోని చిన్న పరిశ్రమలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ శైల, గ్రామ సర్పంచ్ శ్రీదేవి, గ్రామస్తులు తిరుపతిరెడ్డి, పంచాయితీ కార్యదర్శి శివ, కుమ్మెర స్వయం సహాయక బృందం నాయకులు రేవతి, అంగన్‌వాడీ కార్యకర్తలు భాగ్యమ్మ, చెన్నమ్మ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠాపన



బిజినేపల్లి: మండలంలోని నారదగిరి వట్టిం శ్రీవేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం ఉదయం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరునగిరి నరసింహాచార్యులు ఆధ్వర్యంలో హోమం నిర్వహించి స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని వేదమంత్రాలు, ప్రత్యేక పూజల అనంతరం ప్రతిష్ఠించారు. ధ్వజారోహణం, దేవతోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి స్వామి వారి ఎదుర్కోళ్ల కార్యక్రమం కనులపండువగా సాగింది.

డీటీసీలో శిక్షణకు ఏర్పాట్లు చేసుకోవాలి

మహబూబ్‌నగర్ క్రైం: కొత్తగా విధుల్లోకి వచ్చే పోలీస్ సిబ్బందికి శిక్షణ ఇవ్వడం కోసం శిక్షణ కేంద్రంలో అన్నిరకాల సదుపాయాలు, ఏర్పాట్లు చేసుకోవాలని మల్టీజోన్–2 ఐజీ షానవాజ్ ఖాసీం అన్నారు. జడ్చర్లలో ఉన్న జిల్లా శిక్షణ కేంద్రం (డీటీసీ)ని సోమవారం ఆయన సందర్శించారు. రెండు, మూడు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖలోని వివిధ పోస్టులను భర్తీ ప్రక్రియ పూర్తి చేసి వారికి శిక్షణ కార్యక్రమం నిర్వహించే క్రమంలో డీటీసీలో అన్ని రకాల ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. దీంతోపాటు జిల్లాలో రోడ్డు ప్రమాదాలు కట్టడి చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. కేసుల నమోదు, విచారణ త్వరగా పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. పోలీసులు నిత్యం వ్యాయామం, వీక్లీ పరేడ్ చేయించాలన్నారు.

ఎమ్మెల్యే వర్సెస్ ఎంపీ

అచ్చంపేట బీఆర్‌ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం

- సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన ఫోన్ సంభాషణ
- నీ కొడుకు ఫ్లెక్సీలు పెట్టొద్దని గువ్వల ఫైర్
- అధిష్టానమే చూసుకుంటుందన్న రాములు
- జెడ్పీపీఠం ఎన్నిక తర్వాత ముదిరిన వైరం
- ఎన్నికల తరుణంలో 'గులాబీ' శ్రేణుల్లో గందరగోళం



గువ్వల బాలరాజు

పోతుగంటి రాములు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో రాజకీయం రసవత్తరంగా మారింది. అధికార పార్టీ భారత రాష్ట్ర సమితిలోని ఇద్దరు ముఖ్య నేతల మధ్య నువ్వా.. నేనా అన్నట్లు వార్ కొనసాగుతోంది. ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఎంపీ పోతుగంటి రాములు ఒకే పార్టీలో ఉన్నా.. ఇరువురి మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనేంతగా వైరం తారాస్థాయికి చేరినట్లు తెలుస్తోంది. అనూహ్యంగా తెరపైకి వచ్చిన జిల్లా పరిషత్ పీఠం ఎన్నిక వారి మధ్య చిచ్చు పెట్టగా.. క్రమక్రమంగా అగ్గి రాజుకుంది. ఫ్లెక్సీల లొల్లి మొదలు ఎమ్మెల్యే, ఎంపీ మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరడం.. వారి ఫోన్ సంభాషణలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే ఎన్నికల తరుణంలో ఈ పరిణామాలు ఎటు దారితీస్తాయోననే ఆందోళన 'గులాబీ' శ్రేణుల్లో నెలకొంది.

అగ్గి రాజేసిన జెడ్పీ పీఠం ఎన్నిక..

ముగ్గురు సంతానం ఉన్నారనే ఆరోపణల కారణంగా తెలకపల్లి జెడ్పీటీసీ సభ్యురాలిపై అనర్హత వేటుతో జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నిక అనివార్యం కాగా.. పదవిని ఆశించిన ఎంపీ రాములు కుమారుడు, కల్వకుర్తి జెడ్పీటీసీ సభ్యుడు భరత్‌ప్రసాద్‌కు భంగపాటు ఎదురైన విషయం తెలిసిందే. గతంలోనూ ఓ సారి చేజారిపోగా.. దీనికి గువ్వల బాలరాజే కారణమని భావించిన ఆయన అచ్చంపేటలో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యాడు. ఎమ్మెల్యేగా బరిలో ఉండడం ఖాయమని సంకేతాలు పంపించిన ఆయన.. గువ్వలపై బాహాటంగానే విమర్శలు ఎక్కుపెట్టారు. దీంతో పాటు నియోజకవర్గంలో దూకుడు పెంచారు. రోజువారీగా పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

సంభాషణ ఇలా..

- **గువ్వల:** నియోజకవర్గంలో నీ కొడుకు ఫ్లెక్సీలు కట్టడానికి వీల్లేదు.
- **పోతుగంటి:** ఎవరి స్వేచ్ఛ వారికి ఉంటది బాలరాజ్.
- **గువ్వల:** పార్టీలో ఉండదట్ల..
- **పోతుగంటి:** అయితే పార్టీలో తేల్చుకుందాం..
- **గువ్వల:** నాకున్న అధికారాన్ని నేను ఉపయోగిస్తా.
- **పోతుగంటి:** నేను జిల్లా అధ్యక్షుడిగా పని చేశా. నాకు తెలుసు. నీకిచ్చే గౌరవం నీకిస్తా. నాకిచ్చే గౌరవం నాకుంటది. చేసేది చేసి అంతా అయిపోయింది అంటే ఎట్లా?
- **గువ్వల:** అందులో సంబంధం ఉందంటే భవిష్యత్‌లో కూడా చేస్తా.
- **పోతుగంటి:** చేసుకోవయ్యా.. నేనొద్దన్నానా ?
- **గువ్వల:** వయా గియా అని మాట్లాడకు. మంచిగా మాట్లాడు. సర్ అని పిలుస్తుంటే వయా అంటవ్.. అటెండర్ మాట్లాడినట్లు మాట్లాడతవ్..
- **పోతుగంటి:** వయా అంటే ఏంది అర్థం.. అయ్యా బాలరాజ్ గారు.. మీరు చేసేది చేసుకోండి. దాని గురించి ఎందుకంత కోపం..
- **గువ్వల:** ఇక నుంచి నీ కొడుకు పార్టీ ఫ్లెక్సీలు కట్టడానికి వీల్లేదు. ఈ రోజు, రేపు తీసేయండి.
- **రాములు:** అంటే.. అంటే.. నీ బెదిరింపులు నాకాడా పనికి రావు.
- **గువ్వల:** రికార్డు చేసుకో.. ఎవరికైనా చెప్పుకో.. అట్లే చేస్తే నీ కొడుక్కి పార్టీ పరంగా మర్యాద ఉండదు.
- **పోతుగంటి:** నా కొడుకు నాకు సహకారంగా ఉంటడు. ఎవరి కొడుకు వారు సహకారంగా ఉంటడు. మరి నీ కుటుంబ సభ్యుల ఫ్లెక్సీలు ఎందుకు పెట్టారు?
- **గువ్వల:** మా అభిమానులు కట్టారు.
- **పోతుగంటి:** మాకూ అభిమానులే కట్టారు.
- **గువ్వల:** ఇలా చేస్తే మంచిగుండదు.
- **పోతుగంటి:** నీ బెదిరింపులు నా వద్ద చెల్లవు. ఈ విషయం అధిష్టానం వద్దే చూసుకుందాం.

ప్రచారంతో మరింత గ్యాప్..

రాములు అచ్చంపేట నుంచి గతంలో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. టీడీపీ హయాంలో మంత్రిగా పని చేశారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరి.. లోక్‌సభ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ నుంచి పోటీచేసి ఎంపీగా విజయం సాధించారు. ఇదే క్రమంలో తెలంగాణ ఆవిర్భావం తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లో అచ్చంపేట నుంచి ఎమ్మెల్యేగా గువ్వల బాలరాజు గెలుపొందారు. ఆయన ప్రస్తుతం ప్రభుత్వ విప్‌గా, పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అయితే అచ్చంపేటపై ఎంపీ రాములుకు మంచి పట్టుతో పాటు ఆయన కుమారుడు భరత్‌కు విద్యావంతుడిగా పేరు ఉంది. ఎలాగైనా తానూ పోటీలో ఉంటానని భరత్ బహిరంగంగానే చెబుతున్నాడు. పార్టీ సీటిస్తే పర్వాలేదని.. ఒకవేళ ఇవ్వకపోయినా స్వతంత్రంగానైనా బరిలో ఉంటానని పలువురి వద్ద స్పష్టం చేసినట్లు సమాచారం. మరోవైపు ఎమ్మెల్యేపై సొంత పార్టీలో అసంతృప్తి నెలకొందనే ప్రచారం శ్రేణుల్లో కొనసాగుతోంది. ఒకవేళ ఆయనను పక్కన బెడితే.. నాగర్‌కర్నూల్ ఎంపీ రాములుకు అవకాశం ఇవ్వొచ్చని.. వయసు మీదపడిందని భావిస్తే కుమారుడు భరత్ ప్రసాద్‌ను రంగంలోకి దించే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఇది ఎంపీ, ఎమ్మె ల్యే మధ్య మరింత గ్యాప్‌ను పెంచినట్లు తెలుస్తోంది.

ఫ్లెక్సీల్లో ఫొటో లేకపోవడంతో..

ఇటీవల మహాశివరాత్రి సందర్భంగా, సీఎం కేసీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని అచ్చంపేటలో భారీగా ఫ్లెక్సీలు వెలిశాయి. అయితే ఎమ్మెల్యే గువ్వల ఫొటో లేకుండా ఎంపీ రాములు, అతడి కుమారుడు భరత్ ఫొటోలు మాత్రమే ఫ్లెక్సీల్లో ముద్రించారు. దీంతో అసహనానికి లోనైన గువ్వల బాలరాజు.. ఎంపీ రాములుకు ఫోన్ చేయడంతో ఇద్దరి మధ్య మాటల యుద్ధం కొనసాగినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో గువ్వల వార్నింగ్ ఇవ్వడం.. ప్రతిగా ఎంపీ నా వద్ద చెల్లవు అని సమాధానమిచ్చినట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడం హాట్‌టాపిక్‌గా మారింది.

ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి



ఫిర్యాదులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

- ధరణి సమస్యలు స్థానికంగానే పరిష్కరించేలా చూడాలి
- రైతులను గందరగోళానికి గురి చేయొద్దు.. నిర్లక్ష్యం వహిస్తే షోకాజ్ నోటీసులు
- 'ప్రజావాణి'లో కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్: తహసీల్దార్ల వద్దకు వచ్చే ప్రజావాణికి ఫిర్యాదులను అక్కడే క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే ప్రయత్నం చేయాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. సోమవారం ఉదయం నుంచి కలెక్టరేట్‌లో వచ్చిన ప్రజావాణి ఫిర్యాదులను స్వయంగా పరిశీలించడంతోపాటు కలెక్టర్ లాగిన్‌లో ఉన్న ధరణి ఫిర్యాదులను అక్కడిక్కడే పరిష్కరించారు. ఈరోజు వచ్చిన ప్రజావాణి ఫిర్యాదులలో 40 శాతం వరకు ఇప్పటికే పరిష్కారమై సీసీఎల్‌ఏలో పెండింగ్ ఉన్న వారు వచ్చారని, దీంతో గందరగోళం ఏర్పడుతుందన్నారు. జిల్లాలో దాదాపు 80శాతం ధరణి సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. వివిధ కారణాల వల్ల సీసీఎల్‌ఏలో కొంత ఆలస్యం జరుగుతుందని, ఇలాంటి వాటిని మండల స్థాయిలోనే సరిగ్గా పరిశీలించకుండా కలెక్టర్ దగ్గరికి పంపడం ఏంటని తహసీల్దార్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటివి పునరావృతమైతే షోకాజ్ నోటీసు జారీ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. జిల్లాలోని అందరూ అధికారులు, తహసీల్దార్లు తమ నెలవారీ పర్యటన వివరాలను మొదటి వారంలో తనకు పంపించాలని అందుకు ప్రత్యేక లాగిన్ ఇస్తున్నట్లు వెల్లడించారు. క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేసే అధికారులు తాము క్షేత్ర స్థాయిలో గుర్తించిన సమస్యలను టూర్ డైరీలో పేర్కొనాలని, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలు తెలపడంతో పాటు పరిష్కరించే బాధ్యత తీసుకోవాలన్నారు. కలెక్టరేట్‌కు సాధారణ ఫిర్యాదులు 27, ధరణి ఫిర్యాదులు 152 వరకు వచ్చాయి. అడిషనల్ కలెక్టర్ మోతీలాల్, డీఆర్డీఓ నర్సింగ్ రావు, సీపీఓ భూపాల్ రెడ్డి కలెక్టరేట్ లో ఫిర్యాదులు స్వీకరించారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 4 అర్జీలు

నాగర్‌కర్నూల్ క్రైం: పోలీసు ప్రజావాణికి 4 అర్జీలు వచ్చాయని ఎస్పీ మనోహర్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

కనులపండువగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు.. పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు దంపతులు

ఉప్పునుంతల: వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణలు.. మేళతాళాలు.. వందలాదిగా తరలివచ్చిన భక్త సందోహం నడుమ శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం కనులపండువగా జరిగింది. సోమవారం మండలంలోని మామిళ్లపల్లి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణం నిర్వహించారు. ఉదయం స్వామివారికి హోమం, బలిహరణం, ఆర్జితసేవలతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపు, మోహిని, గరుడవాహన సేవ, ఎదురుకోళ్ల కార్యక్రమం చేపట్టారు. మధ్యాహ్నం ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, వరదరాజులు అయ్యంగార్, తిరువేంగళాచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ శాస్త్రోపయుక్తంగా స్వామివారి కల్యాణోత్సవం జరిగింది. అంతకుముందు ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అమల దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఉమామహేశ్వరం దేవస్థానం వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అనంతప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, సర్పంచు కల్పన, ఎంపీటీసీ లక్ష్మమ్మ, ఈఓ శ్రీనివాస్‌రావు, ఆలయ కమిటీ చైర్మన్ రామస్వామిగౌడ్, ఉమామహేశ్వరం దేవస్థాన కమిటీ చైర్మన్ కందూరు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా, బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి రథోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రామస్వామిగౌడ్ తెలిపారు.

రోడ్డు కోసం కేంద్ర మంత్రికి వినతి



మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఆచారి తదితరులు

కల్వకుర్తి రూరల్: మండలంలోని ముకురాల వద్ద అసంపూర్తిగా ఉన్న రోడ్డును పూర్తి చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సోమవారం జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, గుండూరు ఎంపీటీసీ నర్సిరెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మంత్రితో మాట్లాడుతూ అప్పటి కేంద్ర ప్రభుత్వం పంజుగుల నుంచి ముకురాలకు ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన కింద రోడ్డు మంజూరు చేసిందన్నారు. మిగిలిపోయిన కొద్ది రోడ్డును పూర్తి చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతోపాటు మండల సభలో ఎన్ని సార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఈ రోడ్డు పూర్తికి కేంద్రం నుంచి నిధులు మంజూరు చేసేలా, ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించేలా చూడాలని కోరామని ఆచారి విలేకర్లకు తెలిపారు. ఇక విద్యుత్, బస్సు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెంచి.. కేంద్రం ధరలు పెంచిందంటూ ఎమ్మెల్యేలు ఆందోళనలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

ఎంవీఎస్ డిగ్రీ కళాశాల సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మొదటి, రెండు, మూడో సంవత్సరం విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన 1, 3, 5వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను సోమవారం పీయూ వైస్ చాన్స్‌లర్ లక్ష్మీకాంత్‌రాథోడ్ విడుదల చేశారు. సెమిస్టర్– 1లో 1,175 మంది విద్యార్థులకు గాను 332 (28.26 శాతం), సెమిస్టర్–3లో 986 మందికి గాను 510 (51.72 శాతం) ఉత్తీర్ణులయ్యారు. సెమిస్టర్–5లో 981 విద్యార్థులకు గాను 628 (64.02 శాతం) మంది పాసయ్యారు. కార్యక్రమంలో పీయూ రిజిస్ట్రార్ గిరిజా మంగతాయారు, ఓఎస్‌డీ మధుసూదన్‌రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రాజ్‌కుమార్, ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ చంద్రశేఖర్, మల్లికార్జున్, అధ్యాపకులు ఈశ్వరయ్య, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నోటీసులకే పరిమితమా..?

- కల్వకుర్తి ఖాదీబోర్డు స్థలంలో అక్రమంగా దుకాణాల ఏర్పాటు
- పలుమార్లు నోటీసులు అందించినా పట్టించుకోని వైనం
- చివరి నోటీసులిచ్చి నెలలు గడుస్తున్నా లేని కదలిక

ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన ఖాదీ బోర్డు స్థలాన్ని కొందరు యథేచ్ఛగా కబ్జా చేశారు. దుకాణాలు సైతం ఏర్పాటుచేసి సొమ్ము చేసుకుంటున్నారు. స్థలం ఖాళీ చేయాలని సదరు బోర్డు నోటీసులు అందజేసినా.. వారిలో ఇసుమంతైనా చలనం రావడంలేదు. పైగా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారుల్లో కొందరి అండదండలు ఉండడంతోనే స్థలం ఖాళీ చేయడంలేదనే ఆరోపణలు వినవస్తున్నాయి.



కల్వకుర్తిలోని దుకాణదారులకు స్థలం ఖాళీ చేయాలని నోటీసులు అందజేస్తున్న అధికారులు (ఫైల్)

కల్వకుర్తి టౌన్: కల్వకుర్తి మున్సిపాలిటీలో మహబూబ్‌నగర్ రోడ్డుకు సర్వే నంబర్ 56/2లో 16 గుంటల స్థలం ఉంది. మొదటగా అది పట్టా ల్యాండ్‌గా ఉండేది. కల్వకుర్తి మాజీ శాసనసభ్యురాలు శాంతాబాయి పేరుపై ఉన్న 16గుంటలను 1992 సంవత్సరంలో ఆమె కుటుంబసభ్యులు ఖాదీ బోర్డులు తనఖా పెట్టి సుమారు రూ.4లక్షల రుణాన్ని తీసుకున్నారు. ఆ తర్వాతి కాలంలో అసలు, వడ్డీ అంతకంతకూ పెరిగిపోయింది. దీంతో రుణాన్ని కట్టలేని పరిస్థితిలో భూమిని ఖాదీ బోర్డుకు విడిచిపెట్టారు. అప్పటి నుంచి సదరు భూమిపై పూర్తి అధికారాలు ఖాదీబోర్డుకు వచ్చాయి. ఇదే సర్వే నంబర్‌లో దాదాపు 2 ఎకరాల వరకు భూమి ఉన్నా, రికార్డుల ప్రకారం మాత్రం 16గుంటలే మిగిలింది. మిగిలిన ల్యాండ్‌ను చుట్టుపక్కల వారు కబ్జా చేశారనే ఆరోపణలు చాలానే ఉన్నాయి. ఇదిలాఉండగా, ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన ఈ స్థలాన్ని కొందరు కబ్జా చేయటమేగాక అక్కడ నిర్మాణాలు కూడా చేపట్టారు. స్థానిక ప్రజాప్రతినిధులలో ఒకరు వాటన్నింటిని విక్రయించారనే బహిరంగ ఆరోపణలు కూడా ఉన్నాయి.

నోటీసులు జారీచేసినా..

పట్టణంలోని ఖాదీ బోర్డు స్థలంలో పలువురు వివిధ రకాల దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. స్థలం అంతా వారిదే అన్నట్టుగా అక్కడ స్థలాన్ని పూర్తిగా ఆక్రమించేసుకున్నారు. సదరు బోర్డుకు చెందిన అధికారులు అక్కడ స్థలాన్ని ఖాళీచేయాలని సూచించినా వినకపోవడంతో నోటీసులు కూడా ఇచ్చారు. నెలలో స్థలం ఖాళీ చేయాలని లేనిపక్షంలో మేమే దుకాణాలను తొలగించి ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని సదరు అక్రమ దుకాణాదారులకు గతేడాది అక్టోబర్ 28వ తేదీన ఇచ్చిన చివరి నోటీసులో పేర్కొన్నారు. నోటీసులు ఇచ్చి నెలలు గడుస్తున్నా అధికారులు కిమ్మనకుండా ఉండటం వెనుక ఏదో లోపాయికారి ఒప్పందం ఉందని పట్టణంలో జోరుగా చర్చ సాగుతుంది.



ఖాదీ బోర్డు స్థలంలో అధికారులు ఏర్పాటు చేసిన నోటీసు ఫ్లెక్సీ

ఫెన్సింగ్‌కు నిధులు సైతం మంజూరు

ఖాదీ బోర్డు స్థలంలోని అక్రమ దుకాణాలను తొలగించి అక్కడ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు సంబంధిత బోర్డు నుంచి రూ.2లక్షలు నిధులు మంజూరైనట్లు రీజినల్ అధికారి మంగ్తానాయక్ తెలిపారు. అందులో భాగంగా మొదటి విడతగా 50 శాతం రూ.లక్ష ఇప్పటికే మంజూరై రీజినల్ కార్యాలయానికి అందినట్లు సమాచారం. అయితే, ఫెన్సింగ్ ఏర్పాటుచేయాల్సిన ఖాదీ బోర్డు అధికారులు తమపై ఎలాంటి అపవాదు రాకూడదనే ఉద్దేశ్యంతో మున్సిపాలిటీలో తామే ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకుంటామని ఒక లెటర్ ఇచ్చి చేతులు దులుపుకోవడం గమనార్హం. రోజులు గడుస్తున్నా పనుల్లో మాత్రం ఎలాంటి పురోగతి లేదు. ఖాదీ బోర్డు స్థలం అన్యాక్రాంతం కాకుండా అధికారులు సంబంధిత స్థలాన్ని స్వాధీనపరచుకోవాలని పలువురు పార్టీల నాయకులు ఏళ్లుగా కోరుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదనే వాదనలు బలంగా ఉన్నాయి.

స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి



పట్టణంలోని ఖాదీ బోర్డు స్థలంలో కొందరు ఇష్టానుసారంగా దుకాణాలు ఏర్పాటుచేసుకున్నారు. వీరికి స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులతోపాటుగా ఖాదీబోర్డులోని కొందరు అధికారులు సహకరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అన్యాక్రాంతమైన భూమిని కాపాడాలి.

– దివాకర్, బీసీ సంఘం నేత, కల్వకుర్తి

వారంలో ఖాళీ చేయిస్తాం

పట్టణంలోని ఖాదీబోర్డు స్థలంలో ఏర్పాటు చేసిన దుకాణ నిర్వాహకులకు చివరి నోటీసులు గతేడాది అక్టోబర్‌లోనే అందించాం. కొంత గడువు కావాలని దుకాణదారులు అడగడంతో సమయం ఇచ్చాం. వారం రోజుల్లో మున్సిపాలిటీ, పోలీసుల సహకారంతో దుకాణాలు ఖాళీ చేయించి స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తాం.

– మంగ్తానాయక్, ఖాదీ బోర్డు రీజినల్ అధికారి, ఉమ్మడి పాలమూరు

క్లుప్తంగా

కొడుకు ఆత్మహత్య: తండ్రికి గుండెపోటు

ఉండవెల్లి: చేతికొచ్చిన కుమారుడు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా.. తట్టుకోలేని తండ్రి గుండెపోటుకు గురయ్యాడు. ఆదివారం మండలంలోని బైరాపురంలో చోటుచేసుకున్న ఈ సంఘటన సోమవారం వెలుగుచూసింది. ఎస్‌ఐ బాలరాజు కథనం ప్రకారం.. కర్నూలు జిల్లా కల్లూరు మండలం చింతలమునినగర్‌కాలనీకి చెందిన నగరి వేణుగోపాల్, అరుణ దంపతుల ఒక్కగానొక్క కుమారుడు వంశీకృష్ణ(27) బీటెక్ పూర్తి చేసి ఖాళీగా ఉన్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం కర్నూలు నుంచి కారులో అలంపూర్ వెళ్తున్నట్లు ఇంట్లో వారికి సమాచారం ఇచ్చాడు. బైరాపురం శివారులో కారులో పురుగు మందు తన స్నేహితులు శ్రీనివాసులు, అంజిరెడ్డిలకు ఫోన్ చేసి పురుగు మందు తాగానని సమాచారం ఇచ్చాడు. వెంటనే వారు ద్విచక్ర వాహనంపై ఘటనా స్థలానికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న వంశీకృష్ణను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుమారుడు మృతిచెందిన సమాచారం స్నేహితుల ద్వారా తెలుసుకున్న వేణుగోపాల్ గుండెపోటుకు గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా కోలుకున్నాడు. వంశీకృష్ణ ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన ఇసుక ట్రాక్టర్

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

కొత్తకోట రూరల్: అతివేగంతో వస్తున్న ఇసుక ట్రాక్టర్, ఎదురుగా వస్తున్నా ద్విచక్ర వాహనంను ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం రాత్రి పెద్దమందడి మండలం మోజర్ల సమీపంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ కేంద్రానికి చెందిన వహీద్(50), భాస్కర్‌గౌడ్ కొంత కాలంగా శుభకార్యాలకు వంటలు చేసేవారు. రోజువారి పనిలో భాగంగానే సోమవారం పెద్దమందడి మండలంలో ఓ శుభకార్యంలో వంటలు చేసి తిరిగి కొత్తకోటకు వెళ్తున్నారు. పెద్దమందడి మండలంలోని మోజర్ల సమీపంలో పెద్దమందడి వైపు వెళ్తున్న ట్రాక్టర్, ద్విచక్రవాహనం(మోపెడ్) ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న వహీద్(50) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. భాస్కర్‌గౌడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో గాయపడిన వ్యక్తిని అంబులెన్స్‌లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలియజేశారు. ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని, మృతుడికి సంబంధించిన వారు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ వివరించారు.

పాముకాటుతో బాలిక మృతి


లావణ్య (ఫైల్)

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని చిన్నమందడిలో విషాదం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం లావణ్య, సత్యం దంపతులు కుమార్తె లావణ్య (11)తో కలిసి పొలానికి వెళ్లారు. పొలం వద్ద బాలికకు పాము కాటు వేసింది. గమనించిన తల్లిదండ్రులు వెంటనే జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. బాలిక గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. ఆదివారం సెలవు కావడంతో తల్లిదండ్రులతో కలిసి పొలానికి వెళ్లింది.

చెక్‌డ్యాంకు గండ్లు


మద్దూర్ వద్ద చెక్ డ్యాంకు తెగిన కట్టలు


చెక్ డ్యాంకు ఊడిన సిమెంట్ పెచ్చులు

- నిర్మించి ఏడాది గడవకముందే దెబ్బతిన్న వైనం
- చెక్ డ్యాంలోని నీరంతా వృథా

చిన్నచింతకుంట: ప్రభుత్వం ప్రతి ఎకరాకు సాగు నీరు అందించే దిశగా కృషి చేస్తుంది. అందుకు రూ.కోట్లు ఖర్చు చేస్తూ ప్రాజెక్టులు, చెక్‌డ్యాంలను నిర్మిస్తుంది. కానీ క్షేత్రస్థాయిలో అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పనులను నామమాత్రంగా చేపట్టి ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తున్నారు. నిర్మాణాలు చేపట్టి సంవత్సరం గడవకముందే గండ్లు ఏర్పడుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటి పరిసర ప్రాంతాలలో బోరు పంపులకు నీరు అందని పరిస్థితులు దాపురిస్తున్నాయి.

రూ.8.11కోట్ల నిధులు

మండలంలోని మద్దూర్, కురుమూర్తి శివారులో ఊకచెట్టువాగుపై చెడ్‌డ్యాం నిర్మించేందుకు ప్రభుత్వం 2021లో నీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ నుంచి రూ.8.11 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ పనులను నామమాత్రంగా చేపట్టారు. నిర్మాణంతో పాటు ఇరువైపుల కాంక్రీట్‌తో నిర్మించాల్సి ఉంది. కానీ వాగుపై చెక్‌డ్యాం కట్టను మాత్రం నిర్మించి సైడ్ వాల్‌కు మట్టి కట్టను ఏర్పాటు చేసి వదిలేశారు. దీంతో ఏడాది గడవకముందే వర్షాకాలంలో వరదలకు మట్టికట్ట తెగిపోయింది. అంతేకాక ముందు భాగంలో సిమెంట్ పగుళ్లు వచ్చి పెచ్చులు ఊడి సీకులు తేలుతున్నాయి. దీంతో చెక్ డ్యాంలో చుక్కనీరు నిలవడం లేదు. నీరు నిల్వ ఉండి రెండు పంటలు పుష్కలంగా పండుతాయని ఆశించిన రైతులకు నిరాశే మిగులుతుంది. ఈ యాసంగి చివరకు నీరు అందక పంటలు ఎండుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తుంటే అధికారులు దుర్వినియోగం చేస్తున్నారని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కాంక్రీట్‌తో కట్టలు నిర్మించాలి



మద్దూర్ శివారులో చెక్‌డ్యాంను నామమాత్రంగా నిర్మించారు. దీంతో మద్దూర్ గ్రామ పొలాల వైపు మట్టితో కట్టిన కట్ట తెగిపోయింది. వరదలు వచ్చి పంటపొలాలు మునిగిపోతున్నాయి. గతేడాది చుక్కనీరు నిలవలేదు. యాసంగి పంట చివరి వరకు నీరు అందని పరిస్థితి ఏర్పడుతుంది. కాంక్రీట్‌తో సైడ్‌వాల్ కట్టను నిర్మించి, నీరు నిలిచేలా చూడాలి. – సురేందర్‌రెడ్డి, మద్దూర్

నిధులు దుర్వినియోగపరిచారు



చెక్ డ్యాం నిర్మాణంలో అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై పనులను నామమాత్రంగా చేపట్టి నిధులను దుర్వినియోగపరిచారు. నిర్మించినప్పటి నుంచి ఇప్పటి వరకు చుక్కనీరు నిలవడం లేదు. రైతులకు నిరుపయోగంగా మారుతుంది. అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలి. – బాలస్వామి, రైతు, కురుమూర్తి

సైడ్‌వాల్ కట్ట నిర్మిస్తాం



మద్దూర్, కురుమూర్తి మధ్యన ఊకచెట్టువాగుపై నిర్మించిన చెక్‌డ్యాం పనులు ఇంకా చేయాల్సి ఉంది. ఇందులో భాగంగానే ఈ వేసవిలో సైడ్ వాల్ కట్టలను నిర్మిస్తాం. చెక్కడ్యాంలో నీరు నిలిచేలా చర్యలు తీసుకుంటాం. – రావత్‌చంద్, ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ

భవానీసాగర్ అడవిలో మంటలు


మంటలు ఆర్పుతున్న అధికారులు

400కు పైగా హరితహారం మొక్కలు దగ్ధం

కోయిల్‌కొండ: మండల పరిధిలోని భవానీసాగర్ ప్రాంతంలోని మహబూబ్‌నగర్‌- కోయిల్‌కొండ రోడ్డు పక్కన ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో హరితహారంలో నాటిన మొక్కలు దగ్ధమైనట్లు అధికారులు తెలియజేశారు. సోమవారం సాయంత్రం 5:30 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగాయి. అదే సమయంలో అటుగా మహబూబ్‌నగర్ వెళ్తున్న ఎంపీడీఓ జయరాములు రోడ్డు పక్కన మంటలు గమనించి గ్రామపంచాయతీ అధికారులకు ఆయన ఫోన్‌లో సమాచారం అందించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది హుటాహుటిన వాటర్ ట్యాంకర్‌ను తీసుకొచ్చి మంటలు ఆర్పడంతో పెద్ద ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు. ఈ మంటల్లో నాలుగు వందల మొక్కలు దగ్ధమైనట్లు ఎంపీడీఓ వివరించారు. గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డుపై వెళ్తూ.. చేసిన తప్పిదానికి ఈ మంటలు వ్యాపించవచ్చని ఎంపీడీఓ వివరించారు.


కాలిపోయిన వస్తువులు

పూరి గుడిసె దగ్ధం

ఉప్పునుంతల: మండలంలోని దేవదారికుంట తండాలో ఆదివారం రాత్రి వడ్డె మంగమ్మకు చెందిన పూరి గుడిసె ప్రమాదవశాత్తు కాలిపోయి రూ.లక్ష ఆస్తినష్టం జరిగింది. ఇందుకు సంబంధించి సర్పంచ్ పర్వతాలు నాయక్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విద్యుదాఘాతంతో గుడిసెకు నిప్పంటుకొని వస్తువులు, తిండిగింజలు, బట్టలు, కొంత నగదు కాలిపోయినట్లు తెలిపారు. మంగమ్మ గుంటూరు జిల్లాలో ఉద్యోగం చేస్తున్న తన కుమారుడికి వద్దకు వెళ్లగా, ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

నేచర్ గైడ్‌లకు అవగాహన తరగతులు


గైడ్‌లకు యూనిఫామ్ అందజేస్తున్న ఎఫ్‌డీ క్షితిజ

మన్ననూర్: అటవీశాఖలో సఫారీ వాహనాలలో తిరిగే పర్యాటకులకు నేచర్ గైడ్‌లుగా వ్యవహరిస్తూ విధులు నిర్వహించే అటవీశాఖ సిబ్బందికి (చెంచు యువకులకు) వనమాలిక ప్రాంగణంలో ప్రకృతిలోని వన్యప్రాణుల గురించి అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీశాఖ ఫీల్డ్ డైరెక్టర్ క్షితిజ, డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డి సమక్షంలో కర్నాటకకు చెందిన ప్రకృతి పరిశోధకులు వన్యప్రాణులు, పక్షులు, క్రిమి కీటకాలు వాటి విధివిధానాలు తదితర అంశాల గురించి వివరించారు. మూడురోజుల పాటు నిర్వహించే ఈ అవగాహన కార్యక్రమంలో మొదటి రోజు డెమో విధానం కాగా, మిగిలిన రెండు రోజులు అటవీ ప్రాంతంలో పర్యటించి ప్రత్యక్షంగా కనిపించే వన్యప్రాణులు, వాటి కదలికలు అరుపులు, పక్షులు, వాటి అరుపులు, కూతలు, అటవీ వృక్షాలు, వాటి ఉపయోగాల గురించి వివరిస్తారని అన్నారు. అనంతరం గైడ్‌గా వ్యవహరించే చెంచు యువకులు వీటన్నింటినీ తెలియజేయాల్సి ఉంటుందని అన్నారు.

పత్తి మార్కెట్ రోడ్డును మార్చడం కుదరదు

- మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి

జడ్చర్ల: జడ్చర్ల పత్తి మార్కెట్ యార్డును మరో పక్కకు మార్చడం కుదరని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి తెలిపారు. మండల పరిధిలోని గంగాపూర్ గ్రామ శివారులో గల పత్తి మార్కెట్ యార్డుకు వెళ్లేందుకు 167 నంబర్ జాతీయరహదారి నుంచి దాదాపు అరకిమీ మేరకు 80అడుగుల వెడల్పు సీసీ రోడ్డును నిర్మించారు. యార్డుకు రాకపోకలను కొనసాగిస్తున్న రోడ్డును సోమవారం ఆమె పరిశీలించారు. ప్రభుత్వ నిధులతో నిర్మించి యార్డుకు వెళ్లేందుకు అనుకూలంగా ఉన్న ఈ రోడ్డును మరో పక్కగా మార్చేందుకు ఎలా కుదురుతుందని వెంచర్ యజమానిని ప్రశ్నించారు. అయితే ఇటీవల మార్కెట్ యార్డు ముందుభాగం జాతీయ రహదారిని అనుసరించి ఏర్పాటు చేసిన వెంచర్‌లో గుండా మార్కెట్‌యార్డు ప్రధాన ద్వారానికి నేరుగా ఉన్న రోడ్డును వినియోగించుకుని ప్రస్తుతం మార్కెట్ యార్డుకు వినియోగిస్తున్న రోడ్డును తమకు అప్పగించాలని వెంచర్ యజమాని విజయ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన ఆమె, అలాచేస్తే మళ్లీ తాము రూ.2కోట్లు వెచ్చించి సీసీరోడ్డు నిర్మించాల్సి వస్తుందని అన్నారు. ఈమేరకు తహసీల్దార్, పంచాయతీ, మార్కెటింగ్ శాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతానికి ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదని చెప్పారు. కార్యక్రమంలో మార్కెటింగ్ డిప్యూటీ డైరెక్టర్ పద్మహర్ష, జేడీఎం ఇఫ్తెకార్ నజీబ్, మార్కెట్ యార్డు చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


జడ్చర్ల పత్తి మార్కెట్ రోడ్డును పరిశీలిస్తున్న డైరెక్టర్ లక్ష్మీబాయి, తదితరులు

పర్యావరణ హితం.. హోలీ సంబరం

- అందుబాటులో సహజ సిద్ధమైన రంగులు

అచ్చంపేట: ఆనందాల రంగుల పండుగ హోలీ వచ్చేసింది. వయస్సు, లింగబేధం లేకుండా.. ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొంటారు. అయితే హోలీ సందర్భంగా వినియోగించే కృత్రిమ సింథటిక్ రంగులు హాని చేస్తాయి. రకరకాల చర్మవ్యాధులకు గురి చేస్తాయి. కొన్ని రకాల రంగులు కళ్లల్లో పడితే కళ్లకు సైతం తీవ్ర నష్టం జరుగుతుంది. కానీ, ఎలాంటి హాని తలపెట్టని ఆరోగ్యకరమైన సహజసిద్ధ రంగులు కూడా ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. హోలీ కోసం ప్రత్యేకంగా తయారు చేసిన రంగులను వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తయారు చేసిన ఈ సహజమైన రంగులను అతితక్కువ ధరల్లోనే అందుబాటులో ఉంచవచ్చని మేధావి వర్గాలు చెబుతున్నాయి. సింథటిక్ రంగులకు ఏమాత్రం తీసిపోని విధంగా ఉండే ఈ రంగులు చర్మానికి ఎలాంటి హాని చేయవు. వేడుకల అనంతరం నీటితో కడిగితే చాలు.. ఎలాంటి ఆనవాళ్లు కూడా కనిపించకుండా పోతాయి.

కొబ్బరినార, చిలకల దండలు

జడ్చర్ల టౌన్: హోలీ వేడుకలు దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకొంటారు. అయితే తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో కొన్ని ప్రత్యేక ఆచారాలు పాటిస్తూ ఉంటారు. అలాంటిదే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు పలు ప్రాంతాల్లో చిలకలతో చిన్నారులకు దండలు వేయడం ఆనవాయితీగా వస్తుంది. జాతర్లలో దొరికే స్వీట్స్ చిలకలు, బెండు బత్తీసలను కొబ్బరినారకు చుట్టి దండలుగా వేస్తారు. హోలీ పండగ రోజున 12 ఏళ్లలోపు బాలబాలికలకు తమ తల్లిదండ్రులు వీటిని దండలుగా వేస్తుంటారు. దీని వల్ల చిన్నారులకు బాలారిష్టాలు తొలగిపోతాయని నమ్ముతారు.


చిలకల దండతో బాలిక

కిసాన్ సర్కార్ అంటే.. రైతులను రోడ్డున పడేయడమా?


చిన్నపోతులపాడులో మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

మానవపాడు: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చెబుతున్న కిసాన్ సర్కార్ అంటే పేద రైతులను రోడ్డున పడేయడమా అని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆయన చేపట్టిన బహుజన రాజ్యాధికార యాత్ర సోమవారం మానవపాడు మండలంలోని చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు, చెన్నిపాడు, మానవపాడు తదితర గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలంపూర్ నియోజవర్గంలోని రైతుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. రైతులు పండించిన పంటలో ఎకరాకు కేవలం 6 క్వింటాళ్లు మాత్రమే ప్రభుత్వం కొంటుంటే.. మిగతాది దళారుల పాలవుతుందన్నారు. పండిన పంటను మొత్తం కొనకుండా కొద్దిమేర మాత్రమే కొనడం ఏమిటని ప్రశ్నించారు. అబ్ కీ బార్ కిసాన్‌కి సర్కార్ అని గొప్పలు చెప్పే ప్రభుత్వం రైతులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా రోడ్డున పడేసిందన్నారు. రైతులకు బీజేపీ ప్రభుత్వం చేసింది ఏమీ లేదన్నారు. రైతులకు నల్ల చట్టాలు తెచ్చి రైతులను చంపిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దాడులకు మద్దతిస్తూ చట్టాన్ని చేతిలోకి తీసుకొని యువతను రెచ్చగొడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతులకు ఆర్డీఎస్ ద్వారా నీరు అందించాలని, తుమ్మిల లిఫ్టు ద్వారా నీరు ఆగిపోయిందన్నారు. మొక్కజొన్న, మిరప పంటలు దెబ్బతింటున్నాయని నీటిని అందించాలని డిమాండ్ చేశారు. బస్సు సౌకర్యాలు లేవని, పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నతస్థాయి చదువులు చదువుకోవాలని, విదేశాల్లో ఉద్యోగాలు సాధించేలా ఎదగాలన్నారు. పత్తి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని రూ.10 వేలు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కేశవరావు, మహేష్, కనకంబాబు, రాములమ్మ, నాగజ్యోతి, సురేష్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు దుకాణాలపై దాడులు

- నలుగురిపై కేసులు నమోదు

మహబూబ్‌నగర్ క్రైం: మహబూబ్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు సోమవారం జిల్లా కేంద్రంలోని క్రిస్టియన్‌కాలనీ, మోతీనగర్, సంజయ్‌నగర్, తిమ్మసానిపల్లి ప్రాంతాల్లో అక్రమంగా అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలు నిర్వహిస్తున్న బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వీరారెడ్డి మాట్లాడుతూ బెల్టు దుకాణాల్లో మద్యం సీసాల మూతలు తీసి చిల్లరగా మద్యం విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో దాడులు చేసినట్లు తెలిపారు. ఈ దాడులలో సంజయ్‌నగర్‌కు చెందిన క్రిష్ణ, క్రిస్టియన్ కాలనీకి చెందిన మున్నూర్ శ్రీనివాస్, మోతీనగర్‌కు చెందిన చంద్రశేఖర్, తిమ్మసానిపల్లికి చెందిన రాములుపై కేసులు నమోదు చేశామని, అర్బన్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఇకపై బెల్టు దుకాణాల్లో ఎవరైనా మూతలు తొలగించి చిల్లర మద్యం విక్రయిస్తే కేసు నమోదు చేస్తామని, కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ దాడులలో ఎస్‌ఐ శ్రీనివాస్, బబ్బీష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మా బాధలు పట్టవా..?

- పుల్లూరు గురుకుల పాఠశాల విద్యార్థుల ఆవేదన
- ఒంటికి, రెంటికి పంటపొలాల్లోకి వెళ్తున్న వైనం
- విద్యుత్ అంతరాయంతో చీకట్లో భయాందోళన
- కనీస సౌకర్యాలు కరువు.. పట్టించుకోని అధికారులు


తరగతి గదులు లేక డైనింగ్ హాల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు


పుల్లూరు గురుకుల పాఠశాల

ఉండవెల్లి: 714 మంది విద్యార్థులు.. ఒంటికి, రెంటికి..కనీసం తాగడానికి సైతం నీళ్లు లేక తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆవేదనకు గురవుతున్నారు మండలంలోని పుల్లూరు మహాత్మా జ్యోతిరావ్ పూలే గురుకుల బాలికల విద్యార్థులు. కనీస సౌకర్యాలు సైతం లేకుండా ఉండడంతో నిత్యం అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయం ప్రిన్సిపాల్ తెలిపినా పట్టించుకున్న పాపాన పోలేదు.

కనీస సౌకర్యాలు కరువు..

పుల్లూరులోని మహాత్మా జ్యోతిరావ్ పూలే గురుకుల హాస్టల్‌లో 6 నుంచి పదో తరగతి వరకు 471 మంది విద్యార్థులు, 243 మంది ఇంటర్ విద్యార్థులు ఉన్నారు. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలానికి చెందిన గురుకుల విద్యార్థులు కూడా ఇక్కడే విద్యనభ్యసిస్తున్నారు. 714 మంది విద్యార్థులకు సరిపడా గదులు లేక డైనింగ్ హాల్‌లోనే పరీక్షలు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా, కనీసం తాగేందుకు తాగునీటి సౌకర్యం కూడా లేదు. దీనికి తోడు త్రీఫేజ్ కరెంటు లేదన్న సాకుతో ఒంటికి, రెంటికి సైతం వెళ్లేందుకు వీలులేకపోవడంతో చేసేది లేక విద్యార్థులు చీకటి సమయంలో సమీపంలోని పంటపొలాల్లోకి వెళ్లాల్సిన దౌర్భాగ్యపు దుస్థితి నెలకొంది. ఇటీవల గ్రామ పంచాయతీ నుంచి ట్యాంకర్ ద్వారా నీళ్లు తీసుకొస్తున్నా కాలకృత్యాలకే సరిపోవడం లేదని చెబుతున్నారు. సమస్యలపై స్థానిక ప్రిన్సిపాల్, అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. చివరికి ఇబ్బందులు భరించలేక తల్లిదండ్రులతో తమ గోడు వెళ్లబోసుకోవాల్సి వచ్చింది. తల్లిదండ్రులు పాఠశాల నిర్వాహకులు ప్రశ్నించడంతో విద్యార్థుల ఇబ్బందులు వెలుగులోకి వచ్చాయి. సోమవారం పాఠశాలను మిషన్ భగీరథ అధికారులు సందర్శించి సమస్య తెలుసుకొని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తాగడానికి నీళ్లు లేవు..

పాఠశాలలో రెండేళ్లుగా ఉంటున్నా. బోరు నీరు వస్తేనే తాగడానికి, ఉపయోగించడానికి వీలుంటుంది. బోరు నీళ్లు రాకపోవడంతో ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో సరిపోవడం లేదు. కనీసం తాగడానికి సైతం నీళ్లు లేవు. – రమ్య, 9వ తరగతి

ఒక్క బోరుతో ఇబ్బందులు..

గురుకులంలో ఒక్క బోరుతో ఇబ్బందులు పడుతున్నాం. కరెంట్ పోయినప్పుడల్లా నీళ్లు రావడం లేదు. రాత్రి సమయంలో కరెంట్ తీయడం వల్ల భయాందోళనకు గురవుతున్నాం. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి. – ఊర్మిళ, 9వ తరగతి

పైప్‌లైన్ పరిశీలిస్తున్నాం..

గురుకుల పాఠశాలలో మిషన్ భగీరథ పైప్ లైన్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాం. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నీటి సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటాం. – జగన్‌మోహన్, మిషన్ భగీరథ, ఎస్‌ఈ

బోరు పనిచేయడం లేదు..

పాఠశాలలో ఉన్న బోరులో నీళ్లు సరిగా రావడం లేదు. మూడు రోజులు కరెంట్ సమస్య రావడంతో బోరు పనిచేయలేదు. తాత్కాలికంగా గ్రామ పంచాయతీ ట్యాంకర్‌ను ఏర్పాటు చేశాం. మిషన్ భగీరథ అధికారులను సంప్రదించగా, అద్దె భవనంలో ఏర్పాటు చేయలేమని తెలిపారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం. – దేవానందం, ప్రిన్సిపాల్

క్లుప్తంగా...

రాష్ట్రంలో అరాచక పాలన: మహేశ్వర్‌రెడ్డి



మామడ: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అరాచక పాలన సాగిస్తోందని, రానున్న ఎన్నికల్లో పార్టీకి చరమగీతం పాడాలని ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో కాంగ్రెస్ పోరుయాత్రలో భాగంగా నిర్మల్ జిల్లా మామడ మండలంలో సోమవారం పాదయాత్ర చేశారు. ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తమ బతుకులు బాగుపడతాయని ఆశించిన ప్రజలకు బీఆర్‌ఎస్ పాలనలో ఎలాంటి ప్రయోజనం కలగలేదని విమర్శించారు. మాయమాటలు, మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన సీఎం కేసీఆర్ ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో పేదలకు భూములు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే బీఆర్‌ఎస్ ప్రభుత్వం వాటిని లాక్కుని వ్యాపారం చేస్తోందని మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు.

జయరామ్ హత్య కేసులో దోషి రాకేష్‌రెడ్డి



బంజారాహిల్స్ (హైదరాబాద్): ప్రవాస భారతీయుడు, పారిశ్రామికవేత్త చిగురుపాటి జయరామ్ హత్య కేసులో ప్రధాన నిందితుడైన కె.రాకేష్‌రెడ్డి హంతకుడని న్యాయస్థానం నిర్ధారించింది. ఈ మేరకు నాంపల్లిలోని మొదటి అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు సోమవారం తీర్పు చెప్పింది. రాకేష్ రెడ్డికి ఈ నెల 9న శిక్షను ఖరారు చేయనుంది. ఇదే కేసులో నిందితులుగా ఉన్న ముగ్గురు పోలీసు అధికారులు సహా 11 మందిని నిర్దోషులు గా న్యాయస్థానం ప్రకటించింది. ఆర్థిక విభేదాల నేపథ్యంలో జయరామ్ హత్యకు రాకేష్ పథకం వేశాడు. హనీట్రాప్ ద్వారా 2019 జనవరి 30న జయరామ్‌ను జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 10లోని తన ఇంటికి రప్పించాడు. అక్కడే ఆయన్ను నిర్బంధించి రూ.5 కోట్లు డిమాండ్ చేసి.. రూ.6 లక్షలు తీసుకున్నాడు. స్టాంపు పేపర్లు, తెల్ల కాగితాలపై జయరామ్‌తో బలవంతంగా సంతకాలు చేయించుకున్న రాకేష్.. ఆపై దారుణంగా చంపేశాడు. మృతదేహాన్ని కారులోకి వేసుకుని ఆంధ్రప్రదేశ్‌లోని నందిగామ శివార్లలో పడేసి వచ్చాడు. దీన్ని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించడానికి ప్రయత్నించాడు. కేసు దర్యాప్తు పూర్తి చేసిన అధికారులు కోర్టులో 320 పేజీల అభియోగపత్రం దాఖలు చేశారు. ఇందులో 73 మందిని సాక్షులుగా చేర్చారు.

ఫ్యామిలీ డాక్టర్లు రెడీ

ఈనెల 15 తరువాత పూర్తిస్థాయిలో ప్రారంభం

- 1,142 పీహెచ్‌సీల్లో పూర్తి స్థాయిలో వైద్యుల భర్తీ
- రాష్ట్రవ్యాప్తంగా రిజర్వ్‌లో 175 మంది డాక్టర్లు
- 108 అంబులెన్స్‌లు కొత్తగా మరో 146
- వైద్య ఆరోగ్యశాఖలో నాడు – నేడు సహా వివిధ కార్యక్రమాలపై సీఎం ఉన్నత స్థాయి సమీక్ష



సాక్షి, అమరావతి: ఏపీ వైద్య ఆరోగ్య రంగంలో మరో కీలక ఘట్టానికి సన్నాహాలు జరుగుతున్నాయి. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతిష్టాత్మక ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ఈ నెల 15వతేదీ తరువాత పూర్తి స్థాయిలో అమలులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఫ్యామిలీ డాక్టర్ ట్రయల్ రన్ అమలు, వైద్య ఆరోగ్యశాఖలో నాడు – నేడు సహా వివిధ కార్యక్రమాల పురోగతిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిశీలించారు. గతేడాది అక్టోబర్ 21 నుంచి ఫ్యామిలీ డాక్టర్ ట్రయల్ రన్ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఇప్పటి వరకూ 45,90,086 మందికి వైద్య సేవలు అందించినట్లు సమీక్షలో అధికారులు తెలిపారు.

రిఫరల్ సేవలను భాగం చేయండి

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ రిఫరల్ సేవలను ఫ్యామిలీ డాక్టర్ విధుల్లో భాగంగా చేయాలని ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారు. ఆరోగ్యశ్రీ సేవల్లో ఎలాంటి ఇబ్బంది, సమస్యలు ఎదురైనా ఫిర్యాదు చేసేందుకు వీలుగా కార్డులపై నెంబర్ ఉంచాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పూర్తి స్థాయిలో అమలులోకి తెచ్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా 1,142 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) పూర్తి స్థాయిలో వైద్యుల నియామకాలను భర్తీ చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రతి జిల్లాకు నలుగురు అదనపు వైద్యులను సిద్ధంగా ఉంచామన్నారు. ఇక డాక్టర్ల స్వల్పకాలిక సెలవుల సందర్భాల్లో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడకుండా ప్రతి 6–7 పీహెచ్‌సీలకు ఒక వైద్యుడిని అదనంగా నియమించామన్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 175 మందిని రిజర్వ్‌లో ఉంచినట్లు వెల్లడించారు.

మరిన్ని ఔషధాలు.. టెస్టింగ్ కిట్లు.. రిజర్వు వాహనాలు

రాష్ట్రంలో 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లకుగానూ ప్రతి చోటా ఒక కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో), ముగ్గురు నుంచి నలుగురు ఆశా కార్యకర్తలు ఉంటారని అధికారులు చెప్పారు. విలేజ్ క్లినిక్స్, 104 మొబైల్ మెడికల్ యూనిట్ల (ఎంఎంయూ)లో మందుల సంఖ్యను 67 నుంచి 105కి పెంచామన్నారు. 104 ఎంఎంయూలు ప్రస్తుతం 676 ఉండగా కొత్తగా 234 వాహనాలతో కలిపి మొత్తం 910 ఎంఎంయూలతో ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలవుతుందని వివరించారు. ఫ్యామిలీ డాక్టర్ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రామంలోనే ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందిస్తారని అధికారులు తెలిపారు. కొత్తగా 108 అంబులెన్స్ వాహనాలు 146 కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు.

‘స్కిల్’ కుంభకోణంపై సీఐడీ దూకుడు

దర్యాప్తు వేగవంతం.. శ్రీకాంత్ అర్జాకు నోటీసు



సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వ హయాంలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ ఎస్‌డీసీ)లో కుంభకోణంపై సీఐడీ దర్యాప్తు వేగవంతం చేసింది. సీమెన్స్ కంపెనీతో ప్రాజెక్టు పేరిట ప్రజాధనాన్ని కొల్లగొట్టిన కేసులో అప్పట్లో ఏపీ ఎస్‌ఎస్‌డీసీ ఎండీగా వ్యవహరించిన శ్రీకాంత్ అర్జాకు సీఐడీ సోమవారం నోటీసులు జారీ చేసింది. జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీతో రూ.3,300 కోట్ల ప్రాజెక్ట్ పేరిట టీడీపీ ప్రభుత్వ పెద్దలు నిధులు కొల్లగొట్టిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులు కేటాయిస్తే సీమెన్స్ కంపెనీ 90శాతం నిధులు వెచ్చించి రాష్ట్రంలో యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తారని ఒప్పందం చేసుకున్నారు. కానీ సీమెన్స్ కంపెనీ ఒక్క రూపాయి కూడా వెచ్చించకుండానే రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.371 కోట్లు చెల్లించేశారు. వాటిలో రూ.245 కోట్లను డిజైన్ టెక్, స్కిల్లర్ అనే షెల్ కంపెనీల ద్వారా సింగపూర్‌కు మళ్లించి, వాటిని మళ్లీ టీడీపీ పెద్దల ఖాతాల్లోకి బదిలీ చేశారు. అప్పట్లో టీడీపీ ప్రభుత్వంలో ఐటీశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ ఏపీ ఎస్‌ఎస్‌డీసీ వ్యవహారాలు చూడటం గమనార్హం. ఈ కేసులో సీఐడీ అధికారులు డిజైన్ టెక్, షెల్ కంపెనీలకు చెందిన పలువురిని అరెస్ట్ చేశారు. చంద్రబాబు సన్నిహితుడు, అప్పట్లో ఏపీ ఎస్‌ఎస్‌డీసీ డైరెక్టర్‌గా ఉన్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ, ఎండీగా ఉన్న గంటా సుబ్బారావుతో పాటు పలువురిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో సీఐడీ అధికారులు ఇప్పటి వరకూ ఎనిమిది మందిని అరెస్టు కూడా చేశారు. అప్పట్లో ఏపీ ఎస్‌ఎస్‌డీసీ ఎండీగా ఉన్న శ్రీకాంత్ అర్జాకు సీఐడీ సోమవారం నోటీసు జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. సీమెన్స్ కంపెనీ తన వాటా 90 శాతం నిధులు సమకూర్చకుండానే నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ వాటా నిధులను అప్పట్లో ఎండీగా ఉన్న గంటా సుబ్బారావు విడుదల చేశారు. ఆ నిధులే హవాలా మార్గంలో టీడీపీ పెద్దలకు చేరాయి. ఆ తర్వాత శ్రీకాంత్ అర్జా ఎండీగా వచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం ఈ వ్యవహారంలో గోల్‌మాల్ జరిగిందని నిర్ధారించిన తర్వాత కూడా ఏపీ ఎస్‌ఎస్‌డీసీ ఎండీగా ఉన్న శ్రీకాంత్ అర్జా సందేహాస్పదంగా వ్యవహరించడం గమనార్హం. సీమెన్స్ ప్రాజెక్టు విషయంలో అంతా సవ్యంగా జరిగిందని ఆయన నివేదిక ఇవ్వడం విస్మయ పరిచింది. ఆయన రిటైర్ అయి ఢిల్లీలో ఉంటున్నారు. ఆయన్ని ఈ నెల 9న విచారణకు రావాలని సీఐడీ అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు.

జనం మధ్యకు పెద్దపులి పిల్లలు

- నంద్యాల జిల్లా పెద్దగుమ్మడాపురంలోకి వచ్చిన నాలుగు పులిపిల్లలు
- తల్లితో కలిపేందుకు అటవీశాఖ సిబ్బంది ప్రయత్నం



మల్టీపర్పస్ గోడౌన్ వద్ద పులి పిల్లలు

సాక్షి, అమరావతి/కొత్తపల్లి: ఏపీలోని నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం పెద్దగుమ్మడాపురం గ్రామ శివారులోని ఓ గోడౌన్‌లో సోమవారం ఉదయం నాలుగు పెద్దపులి పిల్లలు కనిపించడంతో కలకలం రేగింది. ఆ నాలుగు ఆడ పులి పిల్లలను తల్లి వద్దకు చేర్చేందుకు అటవీశాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని కొత్తపల్లి మండలం పెద్దగుమ్మడాపురం గ్రామం నల్లమల అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉంటుంది. సోమవారం ఉదయం ఓ యువకుడు గ్రామానికి చివర నిర్మాణంలోని మల్టీపర్పస్ గోడౌన్ అవతలివైపునకు వెళ్లగా, నాలుగు పులి పిల్లలు కనిపించాయి. విషయం తెలుసుకున్న అటవీ సిబ్బంది వాటిని పరిశీలించారు. సుమారు 40రోజుల వయసు కలిగిన పులి పిల్లలను అడవిలోకి తీసుకువెళ్లి తల్లితో కలిపేందుకు ప్రయత్నించారు. మూడు గంటలు అడవిలో తిరిగినా తల్లి కనిపించలేదు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో పులిపిల్లలు డీలా పడిపోయాయి. దీంతో వాటికి పాలు పట్టించి బైర్లూటి రేంజ్‌లో ఉన్న జంతువైద్యశాలకు తరలించారు. అటవీ ప్రాంతంలో ఎండ పెరగడం, చెట్లకు మంట పెడుతుండటంతో వేడి తీవ్రత తట్టుకోలేక గ్రామంలోకి పెద్దపులి తన పిల్లలను తీసుకువచ్చి, ఒంటరిగా తిరిగి వెళ్లి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఒకటి, రెండు రోజులు చూసిన తర్వాత కూడా తల్లి రాకపోతే వాటిని తిరుపతి జూకు తరలించి సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

తెలియదు.. గుర్తు లేదు.. మర్చిపోయా

- సీఐడీ విచారణకు ఏమాత్రం సహకరించని టీడీపీ మాజీ మంత్రి నారాయణ
- ఆయన భార్య, ‘నారాయణ’కీలక ఉద్యోగిని ప్రమీల తీరు కూడా అంతే..



సాక్షి, అమరావతి: గత ప్రభుత్వం హయాంలో జరిగిన అమరావతి భూముల కుంభకోణం కేసులో టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పొంగూరు నారాయణ సీఐడీ విచారణకు ఏమాత్రం సహకరించలేదని తెలిసింది. అసైన్డ్ భూములు, బినామీ పేర్లతో భూములు కొనుగోలు, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ రూపొందించడంలో అక్రమాలపై సీఐడీ అధికారులు ఎంత గుచ్చి గుచ్చి అడిగినా నారాయణ ఒక్క ప్రశ్నకు కూడా సమాధానం ఇవ్వలేదని తెలిసింది. తెలియదు.. గుర్తు లేదు.. మర్చిపోయా అనే రీతిలో నారాయణ వ్యవహరించారని సమాచారం. ఈ మేరకు సీఐడీ అధికారులు నారాయణ, ఆయన భార్య పి.రమాదేవి, నారాయణ విద్యా సంస్థల ఆర్థిక వ్యవహారాల కోసం ఏర్పాటు చేసిన ఎన్ స్పైరా సంస్థలో కీలక స్థానంలో ఉన్న పొత్తూరి ప్రమీల అనే ఉద్యోగిని హైదరాబాద్‌లో సోమవారం వేర్వేరుగా విచారించారు. నారాయణ విద్యా సంస్థలు, ఎన్ స్పైరా సంస్థల బ్యాంకు ఖాతాల నుంచి రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యాంకు ఖాతాలకు నిధుల బదలాయింపుపై సీఐడీ అధికారులు నారాయణను ప్రశ్నించారు. ఇక ఆ నిధులతో బినామీల పేరిట అమరావతిలో అసైన్డ్ భూములు కొనుగోలు చేసిన రికార్డులు చూపిస్తూ పలు ప్రశ్నలు వేశారని తెలుస్తోంది. అలాగే నారాయణ బినామీల పేరిట కొనుగోలు చేసిన భూముల సమీపంలోనే స్టార్టప్ సిటీ వచ్చేలా సీఆర్‌డీఏ అమరావతి మాస్టర్ ప్లాన్ రూపొందించిన ఉదంతంపైన కూడా వివరాలు అడిగారు. నారాయణ విద్యా సంస్థలు, చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్, వారి సన్నిహితుడు లింగమనేని కుటుంబానికి చెందిన సంస్థల భూముల విలువ అమాంతం పెరిగేలా ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చేలా నారాయణ అధికార దుర్వినియోగానికి పాల్పడటంపై కూడా సీఐడీ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. కానీ నారాయణ ఒక్క ప్రశ్నకు కూడా సూటిగా సమాధానం చెప్పలేదని తెలుస్తోంది. నారాయణ భార్య రమాదేవి, పొత్తూరి ప్రమీల కూడా విచారణకు ఏమాత్రం సహకరించ లేదు.

నారాయణ కుమార్తెను ఇంటి వద్దే విచారించండి

అమరావతి మాస్టర్ ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ డిజైన్ల ముసుగులో సాగిన భూ దోపిడీపై నమోదు చేసిన కేసులో విచారణ నిమిత్తం తమ ముందు హాజరు కావాలంటూ సీఐడీ జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ నారాయణ కుమార్తె సింధూర, ఆమె భర్త పునీత్, అతడి సోదరుడు వరుణ్ కుమార్, రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అంజనీ కుమార్ బాబీలు హైకోర్టును ఆశ్రయించారు. వీరి పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి సోమవారం విచారణ జరిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి, సింధూరను ఆమె ఇంటి వద్దే ఈ నెల 20న విచారించాలని సీఐడీని ఆదేశించారు. అలాగే అదే రోజున సీఐడీ ముందు హాజరు కావాలని పునీత్, వరుణ్‌లకు సైతం ఆదేశాలు జారీ చేశారు. ఇక అంజనీ కుమార్‌ను అదే రోజున న్యాయవాది సమక్షంలో విచారించాలని సీఐడీకి సూచించారు.

బ్రహ్మోత్సవాల్లో పుత్ర కామేష్టి పూజలు



హోమం నిర్వహిస్తున్న భక్తులు

బిజినేపల్లి: మండలంలోని వట్టెం శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ఆలయం ఆవరణలో పుత్ర కామేష్టి పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం సంతానార్థులకు గరుడ ప్రసాదం అందజేశారు. సాయంత్రం భేరీతాడనం, దేవతాహ్వానం పూజల అనంతరం అలమేలుమంగ సమేత శ్రీవేంకటేశ్వర స్వామికి పల్లకీసేవ నిర్వహించారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో సోమవారం పూర్తి స్థాయి నీటి మట్టం 1,020 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ నీటిని నిలిపివేశారు. సమాంతర కాల్వ ద్వారా 120 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా 65 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

వైభవంగా ధ్వజారోహణం

- మన్యంకొండలో కన్నుల పండువలా గజవాహన సేవ
- నేడు తిరుకల్యాణ మహోత్సవం



అలివేలు మంగతాయారు గజవాహన సేవ నిర్వహిస్తున్న భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండలోని శ్రీ అలివేలు మంగతాయారు బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ధ్వజారోహణం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా దేవస్థానం సమీపంలో ఉన్న పుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేసి, ఆ మట్టిని తెచ్చి, దేవస్థానం పక్కనున్న మండపంలో సాంప్రదాయ రీతిలో హోమం నిర్వహించారు. అనంతరం దేవస్థానం ముందున్న ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేసి ధ్వజారోహణ పూజా కార్యక్రమం, అలాగే అమ్మవారి సన్నిధిలో దేవతాహ్వానము, బలిహారణ, ఎదుర్కోలు నిర్వహించారు.

ఘనంగా సేవ..

ఉత్సవాలలో భాగంగా దేవస్థానంలో ఆదివారం రాత్రి గజవాహన సేవ నిర్వహించారు. శోభాయమానంగా అలంకరించిన వివిధ వాహనంపై అమ్మవారిని గర్భగుడి నుంచి దేవస్థానం ముందున్న మంటపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రాల మధ్య ఈ సేవ ముందుకు కదిలింది. భక్తుల హరినామ స్మరణతో ఆ ప్రాంతం మారుమోగింది. వివిధ రకాల పూలు, బంగారు ఆభరణాల అలంకరణలో అమ్మవారు సేవలో దేవస్థానం పరిసరాల్లో ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. ఈ దృశ్యాన్ని చూసి భక్తులు భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారితో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.



అమ్మవారికి హారతి ఇస్తున్న ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్

నేడు తిరుకల్యాణ మహోత్సవం..

మన్యంకొండ శ్రీ అలివేలు మంగతాయారు ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఉత్సవాలలోని ప్రధాన ఘట్టమైన తిరుకల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ప్రతి ఏడాది హోలీ పండుగ రోజు ఈ మహోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా దేవస్థానం వద్ద తిరుకల్యాణ మహోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవానికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలి రానున్నారు.



గజవాహనంపై అలంకరణలో అమ్మవారు

పంట ఉత్పత్తులను దళారులకు విక్రయించొద్దు

మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి



ఎండుమిర్చి కొనుగోళ్లు ప్రారంభిస్తున్న మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, ఇతర అధికారులు

గద్వాల వ్యవసాయం: పంట ఉత్పత్తులను దళారులకు విక్రయించకుండా, మార్కెట్‌యార్డులోనే విక్రయించాలని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి రైతులకు సూచించారు. సోమవారం ఆమె గద్వాల మార్కెట్‌యార్డులో ఎండుమిర్చి కొనుగోళ్లను లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మార్కెట్‌యార్డులో ఈనామ్ విధానం ద్వారా పంట ఉత్పత్తుల కొనుగోళ్లు జరుగుతున్నాయని, ఈ విధానంతో కొనుగోళ్లు పారదర్శకంగా జరుగుతాయన్నారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా ఎండుమిర్చి కొనుగోళ్లు లేవని, దీంతో ఎండుమిర్చి పండించే రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు గుర్తించి, గద్వాల యార్డులో కొనుగోళ్లు ప్రారంభించినట్లు చెప్పారు. నడిగడ్డ రైతులు ఎండుమిర్చిని కర్ణాటక, ఏపీలోని పలు ప్రాంతాలకు తీసుకెళ్లి వ్యయప్రయాసాలకు గురై విక్రయించేవారని చెప్పారు. ఇక నుంచి వారి కష్టాలు తీరనున్నాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ శ్రీధర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, మార్కెటింగ్ శాఖ జేడీఎం సయ్యద్ ఇఫ్తాకర్ నజీబ్, డీడీఎం పద్మహర్ష, జిల్లా అధికారి పుష్ప, కార్యదర్శి నరసింహ, గంజ్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖరయ్య, ఉపాధ్యక్షుడు నరసింహులు, జనరల్ సెక్రటరీ జయన్న, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

పర్యటక ప్రాంతంగా కొల్లాపూర్ అభివృద్ధి

సినీ దర్శకుడు రాఘవేందర్‌రావు



రాఘవేందర్‌రావును సత్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కొల్లాపూర్: పర్యటక అభివృద్ధి దిశగా కొల్లాపూర్ అడుగులు వేస్తుందని సినీ దర్శకుడు రాఘవేందర్ రావు అన్నారు. ‘సర్కారీ నౌకరీ’ సినిమా చిత్రీకరణలో భాగంగా కొన్ని రోజులుగా ఆయన కొల్లాపూర్ పరిసర ప్రాంతాల్లోనే ఉంటున్నారు. సోమవారం కొల్లాపూర్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన హ్యాపీ స్టే రూమ్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డితో పాటు పలు ప్రజాసంఘాల నాయకులు రాఘవేందర్ రావును శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. సినిమా చిత్రీకరణకు కొల్లాపూర్ పరిసరాలు అనువుగా ఉన్నాయని దర్శకేంద్రుడు అన్నారు. భవిష్యత్‌లో కృష్ణానది తీర ప్రాంతాలు, నల్లమల అటవీ ప్రాంతాలు, ప్రాజెక్టు ప్రాంతాల్లో సినిమా చిత్రీకరణలు పెరుగుతాయన్నారు.

అమ్మవారికి రథోత్సవం





ఆలయంలో రథోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, పూజలు చేస్తున్న జీఎం శ్రీనివాసులు నాయుడు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపురం శ్రీ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం సాయంత్రం రథోత్సవం నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ మూర్తికి రథంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం చుట్టూ మూడుసార్లు రథోత్సవాన్ని ఊరేగిస్తూ ప్రాకార ప్రదక్షిణం చేశారు. వారోత్సవంలో భాగంగా ప్రతి సోమవారం ప్రదోశ కాలంలో ఈ రథోత్సవాన్ని నిర్వహిస్తారని ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు. ఆలయ సిబ్బంది అర్చకులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయంలో ఎన్.హెచ్.ఐ జీఎం

జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను నేషనల్ హైవే అథారిటీ ఢిల్లీలో జీఎం శ్రీనివాసులు నాయుడు కుటుంబ సమేతంగా దర్శించారు. బాలబ్రహ్మేశ్వరుడికి రుద్రాభిషేకాలు, జోగుళాంబ అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. అర్చకస్వాములు వారికి క్షేత్ర ప్రాశస్త్యం తెలియజేశారు. తీర్థ, ప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో సత్కరించారు. అంతకుముందు వారికి అర్చకులు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు.

గజవాహనంపై శ్రీరంగనాథస్వామి ఊరేగింపు



ఆలయం నుంచి గజవాహనంపై విహరిస్తున్న స్వామివారు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన శ్రీరంగనాథస్వామి వారి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం ఉదయం వేద పండితుల వేద మంత్రోచ్ఛరణలతో స్వామివారికి శ్రీవారి తిరువీధి సేవ, రాత్రి రథాంగ హోమం, గజవాహన సేవ కార్యక్రమం నిర్వహించారు. సన్నాయి వాయిద్యాల మధ్య గజహనంపై విహరిస్తున్న దివ్యతేజ స్వరూపుడైన స్వామివారు తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పారవశ్యంతో దర్శించుకున్నారు. వీధుల్లో స్వామివారి వాహన సేవ ఆద్యాంతం కనులపండువగా సాగింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు విష్ణునారాయణ, అర్చకులు గోవిందా చార్యులు, సురేశాచార్యులు, కన్నయ్య స్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

మంగళవారం నిర్వహించే శ్రీరంగనాథస్వామి రథోత్సవ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ట్రస్టు మేనేజర్ వినయ్ తెలియజేశారు. సిబ్బంది రథాన్ని శుభ్రం చేశారు. గ్రామపంచాయతీ కార్మికులు ఆలయ పరిసరాలు, రోడ్లు శుభ్రం చేస్తూ.. బారికేడ్ల నిర్మాణం ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే రథోత్సవాకి వచ్చే భక్తులకు, ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు.

యాక్షన్‌ప్లాన్ ప్రకారం విద్యాబోధన



జిల్లా కేంద్రంలో బీసీ కాలనీ పాఠశాలను పరిశీలిస్తున్న కమిషనర్ దేవసేన

నారాయణపేట రూరల్: ప్రతి ఉపాధ్యాయుడు నిబద్ధతతో విధులు నిర్వహించాలని స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీ, మరికల్ మండలం తీలేర్ ప్రభుత్వ పాఠశాలలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ‘మన ఊరు – మన బడి’ పనులను పర్యవేక్షించి లోపాలను గుర్తించి సవరించేందుకు సూచనలు చేశారు. డైనింగ్‌హాల్ నిర్మాణం, మరుగుదొడ్లు తదితర పనులు వేగవంతంగా, నాణ్యతగా చేయాలని ఆదేశించారు. ఈసందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. ఎఫ్‌ఎల్‌ఎన్ అమలును ప్రత్యక్షంగా పరిశీలించారు. పిల్లలు చదువుతో పాటు వ్యక్తిత్వం, క్రమశిక్షణ నేర్చుకోవాలన్నారు. సరిగా పనులు చేపట్టని పెయింటింగ్ కాంట్రాక్టర్‌ను మందలించారు. హెచ్‌ఎంలు దగ్గరుండి పనులు చేయించుకోవాలని సూచించారు. టెన్త్ విద్యార్థులకు సాయంత్రం తప్పకుండా అల్పాహారం అందించాలన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ఎంఈఓలు, క్లస్టర్ హెచ్‌ఎంలు, డీఈలతో సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలల సుందరీకరణ ప్రక్రియ యజ్ఞంగా చేపట్టాలని, ఎక్కడ నిధుల కొరత లేదని, ప్రభుత్వం పూర్తి స్థాయిలో డబ్బులు అందిస్తుందన్నారు. పనులు పూర్తి అయిన వెంటనే ఎఫ్‌టీపీ అప్‌లోడ్ చేస్తే డబ్బులు అకౌంట్లో జమ అవుతాయన్నారు. విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచేందుకు టీచర్లు కృషి చేయాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు టీచింగ్ డైరీ రాయాలని, యాక్షన్‌ప్లాన్ సిద్ధంగా ఉండాలన్నారు. టెన్త్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణతతో పాటు 10జీపీఏ సాధనకు ప్రత్యేక శ్రద్ధ చూయించాలన్నారు. నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. స్కూల్, కాంప్లెక్స్, ఎమ్మార్సీ గ్రాంట్స్ విషయంలో జాగ్రత్తగా ఖర్చులు చేయాలని, పారదర్శకత చాలా ముఖ్యమన్నారు. పాఠశాలలపై సీఆర్‌పీలు, క్లస్టర్ హెచ్‌ఎంలు, ఎంఈఓలు నిరంతర పర్యవేక్షణ ఉండాలని, నిబంధనలు పాటించాలన్నారు.